కౌలు రైతుల్లో కలవరం

- ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి..
- సొంత భూములున్న వారికే అవకాశం
- కౌలు రైతులను దూరం పెట్టిన సర్కారు
- ఉపాధి కోసం పలువురు రైతులు వలసబాట
- సర్వర్ సతాయింపుతో పూర్తి కాని నమోదు ప్రక్రియ



గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఓ, వీఏఓ

తలుపుల: రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ కౌలు రైతులను కలవర పెడుతోంది. సొంత భూములు కలిగిన రైతులందరూ విధిగా తగిన ఆధారాలతో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి అగ్రిస్టాక్ యాప్‌లో వివరాలు నమోదు చేసి.. 11 అంకెలు కలిగిన విశిష్ట సంఖ్య పొందాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే రైతుల గురించి ఎటువంటి ప్రస్తావనా చేయలేదు. కదిరి నియోజకవర్గంలో సాధారణంగా వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా దిగుబడులు తగ్గిపోయి పెట్టుబడులు సైతం తిరిగిరాని పరిస్థితుల్లో 20 శాతం మంది దాకా రైతులు కుటుంబ పోషణభారమై ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం పరిపాటి. ఈ నేపథ్యంలో నెలాఖరులోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని చెబుతుండడంతో వలస వెళ్లిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు 'అగ్రి స్టాక్' యాప్ సర్వర్ సతాయిస్తుండడం, వలస వెళ్లిన రైతులు అందుబాటులో లేకపోవడంతో నమోదు ప్రక్రియ అనుకున్న సమయానికి పూర్తి కాలేకపోతోంది. ఇప్పటి వరకు 44,055 మంది రైతుల్లో 35,677 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇంకా 20 శాతం మంది చేయించుకోవాల్సి ఉంది. విశిష్ట సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డు లేకుంటే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, పావలావడ్డీ, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, యాంత్రీకరణ, రాయితీ విత్తనాలు, పంట ఉత్పత్తుల అమ్మకాలు తదితర ప్రభుత్వ ఫలాలు వర్తించవని స్పష్టం చేసింది. మరి విశిష్ట సంఖ్య పొందలేని తమకు ఎటువంటి ప్రయోజనాలు వర్తించవా అని కౌలు రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాల్సి ఉంది. నియోజకవర్గంలో రైతుల నుంచి అర ఎకరం నుంచి పది ఎకరాల వరకు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే రైతులు దాదాపు 5వేల మంది దాకా ఉన్నారు. అయితే భూ యజమానులతో అగ్రిమెంట్ చేసుకుని కౌలురైతులుగా గుర్తింపు కార్డులు పొందిన వారు 254 మంది మాత్రమే ఉన్నారు. వ్యవసాయాన్నే నమ్ముకున్న తమలాంటి వారినీ గుర్తించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

కదిరి నియోజకవర్గంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ వివరాలు

మండలం	మొత్తం రైతులు	రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు
కదిరి	6,775	6,035
తనకల్లు	10,090	7,510
నల్లచెరువు	5,929	5,115
గాండ్లపెంట	5,315	4,113
ఎన్‌పీకుంట	6,715	5,420
తలుపుల	9,231	7,484

తప్పనిసరిగా చేయించుకోవాల్సిందే



విశిష్ట సంఖ్య నమోదును ప్రతి రైతూ తప్పనిసరిగా చేయించుకోవాల్సిందే. సమయం ఇంకా ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ప్రస్తుతం సొంత భూమి గల రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.
–సత్యనారాయణ, ఏడీఏ

క్లుప్తంగా

జగన్‌ను పెళ్లికి ఆహ్వానించిన యువనేత



మాజీ సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తాడిమర్రి మనోజ్‌రెడ్డి

తాడిమర్రి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తనయుడు, మండల యువనేత తాడిమర్రి మనోజ్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని నివాసంలో కలిశారు. తన తమ్ముడు తాడిమర్రి చెన్నారెడ్డి వివాహం ఈ నెల 14న గోవాలో జరుగుతుందని, ఆ వేడుకకు హాజరు కావాలని కోరారు. జగన్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ శింగనమల నేత ఆలూరు సాంబశివారెడ్డితో పాటు మండల నాయకుడు మదన్‌మోహన్‌రెడ్డి, రెడ్డెప్ప తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

బత్తలపల్లి: గ్రామీణ ప్రాంత విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని శ్రీవిజేత ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటరాముడు, డైరెక్టర్ రాము సూచించారు. బుధవారం స్థానిక పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు సరస్వతి పూజను వేదపండితులచే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుదలతో చదివితే వంద శాతం ఉత్తీర్ణత సాధించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

టీకాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

తాడిమర్రి: వ్యాధి నిరోధక టీకాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఏఎన్‌ఎం ఆధ్వర్యంలో జరిగిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని తాడిమర్రి, పెద్దకోట్ల, ఎం.అగ్రహారం, నార్శింపల్లి, కునుకుంట్ల, దాడితోట, చిల్లవారిపల్లి, పిన్నదరి తదితర గ్రామాల్లోని విలేజ్ క్లినిక్‌ల్లో ప్రతి బుధవారం, శనివారం ఐదేళ్ల వయసులోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కృష్ణమ్మ, సుగుణ లక్ష్మీకాంతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి



టిడ్కో ఇళ్ల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర నాయకులు

కదిరి టౌన్: పట్టణంలోని గట్లు వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని సీపీఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టిడ్కో ఇళ్లను పరిశీలించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల ప్రాంతంలో కంపచెట్లు పేరుకుపోయి అడవిని తలపిస్తున్నాయన్నారు. ఇళ్లను అప్పగించకుండానే ఇంటి మీద అప్పు చెల్లించాలని బ్యాంకులు లబ్ధిదారులను ఒత్తిడి చేయడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి టిడ్కో ఇళ్లను పూర్తిచేసి ఇవ్వకపోతే లబ్ధిదారులతో కలిసి ఇళ్లను స్వాధీనం చేసుకునే కార్యక్రమాన్ని చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, జీఎల్.నరసింహులు, జగన్, ముస్తాక్, బాబ్జాన్, రామ్మోహన్, నరసింహప్ప, ఉదయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



వేపకుంటలో విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కనగానపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు కనగానపల్లి పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. ఆరోగ్యశాఖ ద్వారా గతంలో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు బుధవారం వైద్య సిబ్బంది కళ్లద్దాలు అందజేశారు. తగరకుంట పాఠశాలలో 8 మంది, మద్దెలచెరువులో 4, వేపకుంటలో 4, ముత్తువకుంట్లలో ఇద్దరు విద్యార్థుల చొప్పున కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలి



గాండ్లపెంటలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న సీడీపీఓ జయంతి

గాండ్లపెంట/ తనకల్లు: మహిళలు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ముందుకు సాగాలని సీడీపీఓ జయంతి పేర్కొన్నారు. బుధవారం గాండ్లపెంట జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ–2, 3 కేంద్రాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి చేరేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, కార్యకర్తలు మునీరా, సాదఖున్నీసా,వెంకటలక్ష్మమ్మ, షకీల, మహిళలు పాల్గొన్నారు. అలాగే తనకల్లు మండలం కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవాలన్నారు. విద్యతోనే ఉన్నత స్థానాలు చేరుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, మహిళా కార్యదర్శి ఫాతీమా, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, సాయిలక్ష్మీ, స్వరూప, ఆయాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్ భద్రతపై అవగాహన



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆర్డీఓ సువర్ణ, ఏడీ విజయశాంతి, ప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: ఇంటర్‌నెట్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ సువర్ణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ విజయశాంతి సూచించారు. బుధవారం పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యాసంస్థల్లో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేఫ్ ఇంటర్‌నెట్‌పై అవగాహన కార్యక్రమం, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న ఆన్‌లైన్ మోసాల బారినపడకుండా పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. విచ్చలవిడిగా సెల్ ఫోన్‌లు వినియోగిస్తుండం, వచ్చిన మెసేజ్‌లకు ఓటీపీలు పంపడం చేయరాదన్నారు. డిజిటల్ ప్రపంచంలో పిల్లలతో పాటు యువత మోసపోతున్నారన్నారు. అమాయక మహిళలు తీవ్రంగా మోసపోతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవగాహనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నుంచి కళాశాల వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి కొండప్ప, డీసీపీయూ మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదుపుపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న పీడీ నరసయ్య

పుట్టపర్తి అర్బన్: డ్వాక్రా మహిళలు బ్యాంకు పొదుపు, రుణ కంతుల చెల్లింపులపై పూర్తి అవగాహన ఉండాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో బ్యాంకు మేనేజర్లు, డీఆర్‌డీఏ సిబ్బందికి ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఖాతాలోనూ మినిమం బ్యాలెన్స్ ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ నాగరాజు, డీపీఎంలు రామిరెడ్డి, రామమోహన్, సత్యనారాయణ, యాంకర్ పర్సన్ రాజశేఖర్ ఏసీలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యంతో పట్టుబడిన బొలెరో వాహనం

ధర్మవరం రూరల్: పట్టణంలోని వై జంక్షన్ ఎర్రగుంట వద్ద బుధవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ పి.నాగేంద్రప్రసాద్ తెలిపారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

7న కలెక్టరేట్‌లో షీబాక్స్

ప్రశాంతి నిలయం: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు తాము పనిచేసే చోట ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఈ నెల 7న కలెక్టరేట్‌లో షీ బాక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీజేఏసీ మహిళా విభాగం జిల్లా చైర్మన్ మైనుద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, వారు పనిచేసే కార్యాలయాల్లో సెలవు తీసుకుని హాజరుకావాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మంజూరులో అక్రమాలు

ఎన్‌పీకుంట: ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో అక్రమాలు జరుగుతున్నాయని లైన్‌మన్ రవిశంకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంకమద్ది గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు రెండు నెలల కిందట వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసి రుసుం చెల్లించారన్నారు. అయితే ఏఈ కార్యాలయంలో విధులు నిర్వహించే సచివాలయ గ్రేడ్–2 జేఎల్‌ఎం అంజనేయులు ఆన్‌లైన్ చేయలేదన్నారు. ఈ విషయమై ఆయన్ని సంప్రదిస్తే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారన్నారు. బోరులేని రైతుకు లంచం తీసుకుని ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, వైరు మంజూరు చేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

అచ్చెన్న వ్యాఖ్యలు సరికాదు



మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలకు నిరసన తెలుపుతున్న నాయకులు

కదిరి అర్బన్: యూటీఎఫ్‌కు రాజకీయ పార్టీ ముసుగు వేస్తూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు గవని కదిరి డివిజన్ యూటీఎఫ్ నాయకులు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో నిర్వహించిన సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, తాహిర్‌వలి, సునీల్‌కుమార్ తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యపై యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. అలాంటి సంఘానికి రాజకీయ పార్టీ ముసుగును ఆపాదించడం కరెక్టు కాదన్నారు.

గాంధారి విద్యలో మెహతాబ్ ప్రతిభ

పావగడ: పట్టణంలోని శ్రీశాల పాఠశాల 5వ తరగతి విద్యార్థిని మెహతాబ్ గాంధారి విద్యలో ప్రావీణ్యం పొంది 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' లో చోటు చేసుకుంది. ఇటీవల బెంగళూరుకు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు మెహతాబ్ ప్రతిభను పరీక్షించారు. కళ్లకు గంతలు కట్టుకుని తన ఎదురుగా ఉంచిన రంగులు, అంకెలు, రూపాయి నోట్లను అవలీలగా గుర్తు పట్టింది. దీంతో ఆమె వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరును నమోదు చేసుకుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం చిన్నారిని ఘనంగా సన్మానించారు.

● ఇఫ్తార్ విందు



కదిరి మున్సిపల్ పరిధిలోని నిజాంవలి కాలనీ మజీద్ ఎ అబూబకర్ సిద్ధిఖీలో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా కూడా పాల్గొన్నారు. – కదిరి అర్బన్ :

బడా సుబ్బిరెడ్డి స్మారక స్తూపం ఏర్పాటు



స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: ఇటీవల మృతి చెందిన ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి స్మారక స్తూపాన్ని కదిరి మండలం వరిగిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేశారు. బుధవారం ఆ స్మారక స్తూపాన్ని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, సీనియర్ నాయకులు ఓబులు ఆవిష్కరించారు.

8న లోక్ అదాలత్

కదిరి టౌన్: ఈ నెల 8న కదిరి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. రాజీకి అవకాశమున్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు కోర్టు లేదా పోలీస్ స్టేషన్‌లలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల పరిశీలన

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఆర్డీఓ మహేష్ బుధవారం పరిశీలించారు. సెకండియర్ ఇంగ్లిష్ పరీక్షకు 109 మందికి గాను 103 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటల మెలకువలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని మరికొమ్మదిన్ని, గొకనపల్లి పంచాయతీల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన పంటల సాగులో మెలకువలపై ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి ఏఓ లోకేశ్వరరెడ్డితో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పుచ్చకాయ, కర్బూజ, టమోటా, మామిడి పంటలను పరిశీలించారు.

తప్పులతడకగా సీనియర్టీ జాబితా

కదిరి అర్బన్: విద్యాశాఖ ప్రకటించిన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా తప్పుల తడకగా ఉందని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షర్ఫొద్దీన్, జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజమ్, కార్యదర్శి మారుతీ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ ర్యాంకుల్లో కూడా తప్పులు ఉన్నాయని తెలిపారు. ఎస్‌ఏ4 పరీక్షలు జరుగుతున్నా, ఇంటర్, టెన్త్ పరీక్షలు ఉన్నా ఆయా మండలాల పరిధిలో సీనియార్టీ జాబితా సవరించడానికి అవకాశం ఇవ్వాలన్నారు.

బాధిత రైతులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి

చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల పంచాయతీ పరిధిలోని హరియాన్ చెరువు సమీపంలో ఇటీవల ప్రమాదవశాత్తూ మొక్కజొన్న తోట, స్ప్రింక్లర్ పైపులు అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి తీసుకెళ్లారు. రైతులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రూ.25 వేలు పంపించారు. బుధవారం ఆ మొత్తాన్ని చెన్నేకొత్తపల్లిలో బాధిత రైతుల కుమారులు నరేష్, మంజునాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, మారుతీప్రసాద్, నారాయణ, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, ఆంజనేయులు, సూరప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



ఆదినారాయణరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

తలుపుల: ఉడమలకుర్తి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదినారాయణరెడ్డి (65) బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ గ్రామానికి వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను సమన్వయకర్త పరామర్శించారు. ఓదులపల్లిలో మృతి చెందిన వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఇంద్రప్రసాద్ కుటుంబ సభ్యులనూ పరామర్శించారు. సిద్దుగూరిపల్లికి చెందిన వైఎస్సార్‌టీఏ మండల అధ్యక్షులు శ్రీనివాసులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. నంగివాండ్లపల్లికి చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి మేనకోడలు డాక్టర్ భూమికారెడ్డి కుటుంబ సభ్యులు మాజీ సర్పంచ్ సూర్యనారాయణరెడ్డిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. సమన్వయకర్త వెంట మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫినాయక్, మాజీ జెడ్పీటీసీ సురేంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ రామిరెడ్డి, సర్పంచ్ షేక్షావలి, ఉత్తారెడ్డి, ఓబులరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కిష్ట, జిలాన్ పాల్గొన్నారు.

ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్: ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మశ్రీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 79811 71568 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వివాదాస్పద స్థలం పంచాయతీకి స్వాధీనం



పంచాయతీకి అప్పగించిన స్థలం వద్ద బోర్డు పెట్టిన సర్పంచ్, కార్యదర్శి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లిలో వివాదాస్పదంగా ఉన్న భూమిని బుధవారం ప్రజలు సిద్దరాంపురం గ్రామపంచాయతీ సర్పంచ్ రమణయ్య, పంచాయతీ కార్యదర్శి శంకర్ స్వాధీనం చేశారు. గతంలో ఈ భూమిని ప్రభుత్వం ఎస్సీల శ్మశాన వాటిక కోసం కేటాయించింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఈ స్థలాన్ని గ్రామస్తులు, సర్పంచ్ చొరవతో పంచాయతీకి అప్పగించారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

అమడగూరు: శీతిరెడ్డిపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. బుధవారం ఇంగ్లిష్–2 పరీక్ష నిర్వహించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్ పేర్కొన్నారు.